

పంటలను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు



ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ పాతపేట గ్రామపరిసరాల్లో గురువారం తెల్లవారు జామున ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేసింది. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం గోగులమ్మ వంక నుంచి వచ్చిన ఏనుగు కల్లూరు – సదుం మార్గం గుండా రోడ్డుకు ఇరువైపులా నాటిన చెట్లను ధ్వంసం చేసి, సూచిక బోర్డులను దొర్లించి వేసింది. అనంతరం పాతపేట పరిసరాల్లోని వ్యవసాయ పంటలు వరి పంట, టమోటా, అరటి చెట్లను విరిచేసింది. రైతు గుర్రప్పకు చెందిన వరి పంటను తొక్కివేసి తిరిగి అడవిలోకి వెళ్లిపోయింది.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే

రూ.175 కోట్లతో వంతెనలు, రీటైనింగ్ వాల్ పనులకు ప్రతిపాదనలు
నీవా నది వరద ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నీవా నదికి వరదలు వచ్చినా పరివాహక ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా శాశ్వత పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. బుధవారం కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి నగరంలోని నీవా నది పరివాహక ప్రాంతాలైన తోటపాలెం ఎటివార, దోభీ ఘాట్, వీరభద్రకాలనీ, తేనబండ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. సంతపేట లిల్లీ బ్రిడ్జి దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి నదికి అవతల ఉన్న కుటుంబాలతో మాట్లాడారు. సంతపేట, విజయలక్ష్మి కాలనీ నుండి రోడ్డు సౌకర్యం కల్పించి, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం వీరభద్ర కాలనీలో పర్యటించి స్థానికంగా దెబ్బతిన్న కల్వర్టరును పరిశీలించారు. అనంతరం తేనబండ కల్వర్టరును వరద నీటిలోనే వెళ్లి పరిశీలించారు. కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనంతగా నీవా నదికి వరదలు రావడంతో ఈ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఈ పరిస్థితిని ముందే ఊహించి నదిలో జేసీబీ సాయంతో ముళ్లపొదలు, పూడిక తొలగించడం జరిగిందన్నారు. దీని వలన వరద ప్రభావం త్వరగా తగ్గిందని, నీటిమట్టం పెరిగిన సమయంలోనే నగరపాలక అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా తొలగించడం ద్వారా కొన్ని గంటల్లోనే నీటి మట్టాన్ని తగ్గించి ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా సకాలంలో చర్యలు తీసుకున్నారని తెలిపారు. నీవా నది పరివాహ ప్రాంతాల ప్రజల సమస్యలు శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ఇదివరకే రూ.175 కోట్లతో వంతెనలు, కల్వర్టర్లు, రీటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి, సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ ఫైలు ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉందని, స్థానికంగా నెలకొన్న పరిస్థితులను కలెక్టర్ ద్వారా మరోసారి నివేదిస్తామన్నారు. అనంతరం వీరభద్ర కాలనీ ప్రజలకు ఎమ్మెల్యే నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో మేయర్ ఎస్.అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజులు, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.



వరద ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే గురజాల

ప్రయాణికులు బేజారు

'మోడీ జీఎస్టీ సక్సెస్ సభ' ఎఫెక్ట్
ఆర్టీసీ బస్సులు 'కర్నూలు బాట'

ప్రజాశక్తి- తిరుపతి సిటీ
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీఎస్టీ సక్సెస్ సభ కర్నూల్లో గురువారం జరిగింది. మోడీ సభ సక్సెస్ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం భుజాన వేసుకుంది. జనాలను తరలించేందుకు ఆర్టీసీ సర్వీసులను పెద్దమొత్తంలో వినియోగించారు. బస్సులన్నీ కర్నూలు బాట పట్టడంతో గమ్యస్థానం చెరుకునేందుకు సర్వీసుల్లేక ప్రయాణికులు, యాత్రికులు బస్టాండ్ లోనే పడిగాపులు కాస్తుండటం గమనార్హం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో దాదాపు వెయ్యి ఆర్టీసీ సర్వీసులు 'కర్నూలు బాట' పట్టాయని సమాచారం.



తిరుపతి బస్టాండ్‌లో బస్సుల్లేక ప్రయాణికులు నిరీక్షణ

దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం జీఎస్టి సక్సెస్ సభలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్లోని కర్నూల్లో జీఎస్టీ సక్సెస్ సభ గురువారం నిర్వహించారు. ప్రధాని ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సూపర్ సిక్స్, జీఎస్టి సక్సెస్ పేరుతో సభను ఏర్పాట్లు చేసింది. మోడీ సభను విజయవంతం చేయాలని కూటమి ప్రభుత్వం భావించింది. ఇంకేముంది ఆ సభకు కనీసం లక్ష మందిని తరలించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. జనాల తరలింపుకు వారి వద్దనున్న ఏకైక మార్గం ఆర్టీసీ. నెలకు ముందే అన్ని ఆర్టీసీ డిపోల అధికారులకు కర్నూలు మోడీ సభకు వీలైతే ఎక్కువ బస్సులు సిద్ధం చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా ముఖ్యమంత్రి సొంత జిల్లా కావడంతో ఇక్కడ ఆర్టీసీ అధికారులు ఎక్కువ బస్సులు పంపేందుకు సిద్ధమయ్యారు. ఇంకేముంది బుధవారం మధ్యాహ్నానికే ప్రతి గ్రామానికి, మారుమూల ప్రాంతాలకు సైతం బస్సులు చేరుకున్నాయి. దీంతో తిరుపతి ఆర్టీసీ సెంట్రల్ బస్టాండ్ బస్సులు లేక బోసిపోయింది. కేఎస్ఆర్టిసి (కర్ణాటక) టీఎన్ఆర్టిసి (తమిళనాడు) సర్వీసులే జిల్లా వాసులకు దిక్కు అయ్యాయి. సప్తగిరి సర్వీసులన్నీ తిరుపతి తిరుమల మధ్య నడుపుతూ, ఉన్న అర కొర పల్లె వెలుగు బస్సులను పుంగనూరు, పీలేరు, రాజంపేట, శ్రీకాళహస్తికి మళ్ళించారు. చిత్తూరు వైపు వెళ్లే వాళ్లకి కష్టగిరి వెళ్లే ఏపీఎస్ఆర్టీసీ, కేఎస్ఆర్టిసి బస్సులే దిక్కయ్యాయి. జిల్లా నలుమూలలకు వెళ్లాల్సిన ప్రయాణికులు, ఇతరత్రా ప్రాంతాలకు దర్శనానికి వెళ్లాల్సిన యాత్రికులు బస్సులు లేక తీవ్ర అవస్థలు పడ్డారు. చనిపోయిన బంధువులను కడసారి చూసుకునేందుకు వెళ్లలేక, బంధువుల దినకర్మలకు, పెళ్లిళ్ల ఇతరత్రా శుభకార్యాలకు హాజరయ్యేందుకు తమ ఊర్లకు వెళ్లలేక జిల్లా వాసులు అవస్థలు పడ్డారు. తిరుపతి జిల్లావ్యాప్తంగా 500 పైనే ఆర్టీసీ సర్వీసులను మోడీ సభకు తరలించినట్లు తెలుస్తోంది. అయితే అధికారులు మాత్రం 330 బస్సులను పంపినట్లు చెబుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వెయ్యి పైనే బస్సులు కర్నూలు బాట పట్టాయని సమాచారం.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలో హై రోడ్డులో జరుగుతున్న విస్తరణ పనులను కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గురువారం పరిశీలించారు. హైకోర్టు డౌన్ నుంచి సంతపేట, లిల్లీ వంతెన వరకు రోడ్డును విస్తరణ, అభివృద్ధి పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా పనులను పరిశీలించి చేపట్టాల్సిన పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గాంధీ రోడ్డు, హైరోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని, రహదారులు విస్తరించి రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలు, కాలుష్య నియంత్రణలో భాగంగా రోడ్లను విస్తరించాల్సిన అవసరం ఉందని.. ఇందుకోసం భవనాల యజమానులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని, వారి సమస్యల పరిష్కరించుకుంటూ రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నామన్నారు. రోడ్ల విస్తరణ, అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని. నగర అభివృద్ధికి అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్ల విస్తరణకు సహకరిస్తున్న ప్రజలకు, జిల్లా కలెక్టర్‌కి ఎమ్మెల్యే గురజాల ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్.అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీఎన్.రాజసింహులు, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజులు పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

బాలుర వసతి గృహాల్లో తనిఖీలు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులోని మెప్మా కార్యాలయంలోని బాలుర హాస్టలను అర్బన్ స్పెషల్ ఆఫీసర్, మెప్మా పీడీ రవీంద్ర గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలమనేరు పురపాలక సంఘంలోని మెప్మా కార్యాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలను సందర్శించారు. భోజన సదుపాయాలు గురించి అగిడి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్స్‌లో మరింత మెరుగ్గా పారిశుధ్యం నిర్వహణ జరగాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎద్దులసంత వీధిలోని నీటిసరఫరా పంప్ హౌస్‌ను పరిశీలించారు, నీటి సరఫరా , క్లోరినేషన్ గురించి అసిస్టెంట్ ఇంజనీర్ స్నేహప్రియను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రభలకుండా నీరునిల్వ ఉన్న కొబ్బరి చిప్పలు, టైర్లు, నీటితొట్టెలు, డ్రమ్ములు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకునేలా ప్రజలకు సూచించాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది శ్రీరాములు, బాబా, సిబ్బంది పాల్గొన్నారు.



హాస్టల్స్‌ను పరిశీలిస్తున్న మెప్మా పీడీ

పంచాయతీ భూములను కాపాడాలి

కాణిపాకంలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి
సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి- ఐరాల: చిత్తూరు జిల్లాలో జిల్లాకే ప్రమాణికంగా ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం కాణిపాకంలో జరుగుతున్న అక్రమాలపై సమగ్రవిచారణ చేపట్టాలని, పంచాయతీ భూములను కాపాడాలని, శ్మశానం ఏర్పాటు చేయాలని, పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు గురువారం కలెక్టర్‌కి బహిరంగ లేఖ రాయడం జరిగింది. ఆలయ అభివృద్ధి కోసం స్థానిక ప్రజలు భూములు ఇచ్చి సహకరించినప్పటికీ వారి కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వకుండా అన్యాయం చేయడం దారుణమని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఇచ్చిన భూములను కూడా ఖాళీగా పెట్టి ఆ భూములను ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకోవడానికి అవకాశం కల్పించిన ఆలయ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికులకు ప్రాధాన్యత లేనిచోట ఉద్యోగాలు ఇచ్చి అవమానపరచడమే అని అన్నారు. ఈ విషయాలపై స్థానికంగా ప్రజలు, మాజీ సర్పంచ్ గోపీనాథ్ ప్రశ్నిస్తుంటే వారిపై దౌర్జన్యాలకు దిగుతూ ఇప్పటికే రెండు మూడుసార్లు హత్యాప్రయత్నం చేయడం దారుణమన్నారు. ప్రశ్నిస్తున్న ప్రజలకి మాజీ సర్పంచ్‌కి జిల్లా పోలీస్ అధికారులు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కాణిపాకం ఆలయ అభివృద్ధికి పంచాయతీ అభివృద్ధికి సిపిఎం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని, అక్రమాలపై మాత్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన బోర్డు చైర్మన్, ఇతర సభ్యులు కూడా కాణిపాకం జరుగుతున్న విషయాలపై సమగ్రంగా చర్చించి బోర్డులో పంచాయతీ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలన్నారు. కాణిపాకంలో జరుగుతున్న అక్రమాలు, భూకబ్జాలపై అధికారులు చర్య తీసుకోకపోతే స్థానికలను కలుపుకొని సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఆదర్శ మార్కెట్ యార్డ్‌గా తీర్చిదిద్దుతాం..

కుప్పం ఏఎంసి చైర్మన్ మునిరాజు



ప్రజాశక్తి- రామకుప్పం: గ్రామాల్లో రైతు మిత్ర సంఘాలను పునరుద్ధరించి రైతులకు అండగా నిలవాలని ఏఎంసి చైర్మన్ మునీరాజు కోరారు. కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధి కి కృషి చేస్తోన్నదని ఆయన పేర్కొన్నారు. గురువారం రామకుప్పంలో అధికారులు, సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో రైతులకు అన్ని విధాలా అండగా ఉండాలని టిడిపి ప్రభుత్వం రైతుమిత్ర సంఘాలను ప్రారంభించిందన్నారు. వైసీపీ పాలనలో అవి నిర్వీర్యమై రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం రైతులకు అన్నివిధాల ఆసరా అందిస్తుందన్నారు. అనంతరం రామకుప్పం మినీ మార్కెట్ యార్డును స్థానిక నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. మినీ మార్కెట్ యార్డులో కల్పించాల్సిన వసతులపై చర్చించి, మార్కెట్ యార్డును అన్ని సదుపాయాలతో ఆదర్శ మార్కెట్ యార్డ్‌గా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర గ్రంథాలయ బోర్డ్ డైరెక్టర్ మునస్వామి, టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనంద్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, నరసింహులు, మునీంద్ర నాయక్, వెంకటరమే గౌడు, రఘు, రామ్మూర్తి, ఏఈ వెంకట సుబ్బయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

60 టిఎమ్‌టిపిఎ ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్ ప్రారంభం

రోజుకి 20వేల గ్యాస్ సిలిండర్లు ఫిల్లింగ్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి), చిత్తూరు అర్బన్: సుమారు రూ.200 కోట్ల విలువైన ఈ అత్యాధునిక చిత్తూరు బాట్లింగ్ ప్లాంట్ సంవత్సరానికి 60వేల మెట్రిక్ టన్నుల బాట్లింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు జిల్లాలు, తమిళనాడులోని రెండు జిల్లాలు, కర్ణాటకలోని ఒక జిల్లాలో విస్తరించి ఉన్న 80 మంది పంపిణీదారుల ద్వారా 7.2లక్షలకు పైగా వినియోగదారులకు సేవలను అందిస్తుంది. ఈ ప్రాంతంలోని గృహాలు, హోటళ్ళు, పరిశ్రమలకు ఎల్పీజీ సిలిండర్లను విశ్వసనీయంగా సకాలంలో సరఫరా చేయడంలో ఇంధన లభ్యతను మరింత బలోపేతం చేయడంలో ఈ ప్లాంట్ కీలకపాత్ర పోషిస్తుంది. చిత్తూరు బాట్లింగ్ ప్లాంట్‌లో ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసారంలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొన్నారు. అలాగే ఇండియన్ ఆయిల్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయం) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అండ్ స్టేట్ హెడ్ పియూష్ మిట్టల్, సీనియర్ ఇండియన్ ఆయిల్ అధికారులు, ఎల్పీజీ పంపిణీదారులు, స్థానిక పరిపాలన సభ్యులు, ప్రజలు చిత్తూరు ప్లాంట్ ప్రాంగణంలో ఎల్ఈడీ వీడియో వాల్ ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించారు.



గ్యాస్ ఫిల్లింగ్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

'దుముకురాళ్ల' అభివృద్ధికి శ్రీకారం

త్వరలోనే పనులు ప్రారంభం: జిల్లా టూరిజం ఆఫీసర్ నరేంద్ర కుమార్



జలపాతాన్ని పరిశీలిస్తున్న జిల్లా టూరిజం ఆఫీసర్ నరేంద్ర కుమార్

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి
మండల పరిధిలోని కైగల్ వద్ద ఉన్న పర్యాటకకేంద్రమైన దుముకురాళ్ల జలపాతాన్ని మరింత అభివృద్ధి చేయాలని జిల్లా టూరిజం శాఖ అధికారులు సంకల్పించారు. గురువారం జిల్లా టూరిజం ఆఫీసర్ నరేంద్ర కుమార్ జలపాతాన్ని సందర్శించి, అవసరమైన మౌలిక సదుపాయాలపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలపాతాన్ని సందర్శించే పర్యాటకులకు మరింత అనుకూలంగా ఉండేలా పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. బైరెడ్డిపల్లి – కుప్పం జాతీయ రహదారి నుంచి జలపాతానికి ఉన్న మార్గాన్ని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే శివలింగం వరకు రహదారి నిర్మాణం, పార్కింగ్ సౌకర్యం, టాయిలెట్లు, వర్షాకాలంలో ఆశ్రయం పొందేందుకు షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్టు ఆయన తెలిపారు. జలపాతం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించడం వలన పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని, ఇందుకోసం ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని ఆయన తెలిపారు. ప్రజల సహకారంతో ఈ పర్యాటక ప్రదేశాన్ని రాష్ట్రంలోని ప్రముఖ టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అధికారులు దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

8వ రాష్ట్రీయ పోషణ మాసం

ప్రజాశక్తి- విజయపురం (నగరి): నగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం సిడిపిఓ ఇంద్ర ప్రియదర్శిని ఆధ్వర్యంలో ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతా, శిశు సంపూర్ణ ఆరోగ్య రక్షణే లక్ష్యంగా రాష్ట్ర సర్కారు ముందు కెళ్తోందన్నారు. ఇందుకోసం యేటా పోషణ్ అభియాన్ పేరిట మాసోత్స వాలను నిర్వహిస్తున్నదని, వివిధ శాఖల సమన్వయంతో పోషకాహారంపై అవగాహన, చిన్నారులకు అన్నప్రాసన, సీమంతాలు, అక్షరాభ్యాసం, గర్భిణుల నమోదుతోపాటు పరీక్షలు, వైద్యశిబిరాల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, మెడికల్ ఆఫీసర్ కీర్తన, ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఇంద్రరా, స్వామిని, శంకరమ్మ, శ్యామల, లక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రొంపిచర్ల: ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసం బొమ్మయ్యగారిపల్లి పంచాయతీలోని కుమ్మరపల్లి అంగన్వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టి.సుస్మిత మాట్లాడుతూ పోషకాహారం పై గర్భవతులకు బాలింతలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం పోషక పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రెడ్డిమంజుల, అంగన్వాడి వర్కర్స్ లక్ష్మీదేవి, సుస్మిత, హెల్పర్ మీనా పాల్గొన్నారు. అలాగే పులిచెర్ల మండలం మిట్టమీద రాచపల్లి అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. విజయలక్ష్మి మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే గర్భవతులు బాలింతలు, కిశోర బాలికలు, చిన్నపిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి అంగన్వాడీలు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు.



నగరిలో మాట్లాడుతున్న సిడిపిఓ ఇంద్ర ప్రియదర్శిని

గూగుల్ రాకతో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి- పలమనేరు: గూగుల్ రాకతో ఎఐ సిటీగా విశాఖపట్నం రూపాంతరం చెందుతోందని దీంతో రాష్ట్రానికి భారీ ఆదాయంతో పాటు యువతకు 1.88 లక్షల ఉద్యోగావకాశాలు చేకూరనున్నాయని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుపై గూగుల్ సంస్థతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్న అంశాన్ని వివరిస్తూ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.

పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ..

చిత్తూరు (యాదమరి): విశాఖలో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా యావత్ భారతదేశం ప్రపంచ వేదికపై సాంకేతిక శక్తిగా నిలుస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు. గురువారం చిత్తూరు నగరంలోని లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్ మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం చరిత్రాత్మకమైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి, మంత్రి నారా లోకేష్ నిరంతర కృషి ఫలితంగా విశాఖ ఇప్పుడు ఏఐ సిటీగా రూపాంతరం చెందుతోందన్నారు.

నేడు ఎమ్మెల్యే కార్యాలయంలో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక లక్ష్మీనగర్ కాలనీ ఎమ్మెల్యే కార్యాలయంలోని ప్రజాదర్బార్‌లో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం 17వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ప్రజలు వినతిపత్రంతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాన్ని జత చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని సంబంధిత శాఖల ఉన్నతాధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

యువజన క్రీడలు ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖకు చెందిన మై భారత్, చిత్తూరు ఆధ్వర్యంలో సమితి స్థాయి క్రీడాపోటీల కార్యక్రమం గురువారం స్థానిక విజయం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి బి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ మై భారత తరపున 2025–26 వార్షిక సంవత్సరంలో నిర్వహిస్తున్న యువజన కార్యక్రమాల వివరాలను తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో క్రీడాకారులకు అందిస్తున్న పథకాలను గురించి తెలిపారు. మై భారత్ ప్రాంతీయ గణంకా అధికారి ఎంసి బాబు రెడ్డి మాట్లాడుతూ వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు డిసెంబర్‌లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక అవుతారని తెలిపారు. యూత్ ఫర్ సేవ అసోసియేషన్‌తో కలిసి నిర్వహించిన ఈ వాలీబాల్ పోటీలలో సుమారు 12 జట్టులు, 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో పురుషుల విభాగంలో వెదురుకుప్పం యూత్ ప్రథమ స్థానంలో నిలవగా స్త్రీల విభాగంలో కృష్ణవేణి జూనియర్ కళాశాల క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచారు. గెలిచిన క్రీడాకారులకు క్రీడా సామగ్రి, బంగారు పతకంతో పాటు ధ్రువపత్రాలను అతిధులు అందజేశారు. విజయం విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాజగోపాల్ నాయుడు, యూత్ ఫర్ సేవా ప్రెసిడెంట్ హరీష్, ఎంపైర్లు నాగరాజ్, శరత్ పాల్గొన్నారు.



విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రదీప్ కుమార్

కలెక్టర్, ఎంపీతో ఎమ్మెల్యే గురజాల భేటీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావుతో కలిసి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో భేటీ అయ్యారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి చిత్తూరు నగర అభివృద్ధిపై చర్చించారు. ప్రధానంగా రహదారుల విస్తరణ, భూయజమానుల సమస్యల పరిష్కారం, పరిహారం, రహదారుల అభివృద్ధి పనుల వేగవంతంపై చర్చించారు. నీవా నది వరదల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ప్రధానంగా నీవా నదిపై నిర్మించాల్సిన వంతెనలు, కల్వర్టర్లు, రీటైనింగ్ వాల్ సంబంధించి నిధుల సమీకరణ తదితర అంశాలపై మాట్లాడారు.

టెలి మెడిసన్ విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి గురువారం జిల్లాలోని సీనియర్ అసిస్టెంట్స్‌తో సమీక్ష నిర్వహించారు. చిత్తూరు జిల్లాలో త్వరలో జరగబోయే డీఐఎన్‌సీ (టెలి మెడిసిన్) కార్యక్రమానికి కావాల్సిన వసతులు, బడ్జెట్ నిర్వహణ, పిహెచ్‌సిలో జెఎస్‌వై పేమెంట్స్ జెఎస్ఎస్‌కే, పిఎంఎంవివై, శాలరీస్, తదితర పేమెంట్స్ పక్కా ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. అలాగే అన్ని బిల్లు అప్లోడ్ చేయాలని, అన్ని జాతీయ ఆరోగ్యకార్య క్రమాలను రోజువారి అప్లోడ్ చేయాలని తెలిపారు. డిపిఎంఓ డాక్టర్ ప్రవీణ, ఏవో మోహన్ రాజు, సూపరింటెండెంట్లు నరసింహులు, గిరిధర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఓ

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి..

జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఇందిర



ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని తొడతర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ ప్రైమరీ ప్రాథమిక పాఠశాలను జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఇందిర, విద్యాశాఖ అధికారి హేమలత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనం పరిశీలించి వంట తయారీకి గ్యాస్ మాత్రమే వాడాలని, వంట పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈసందర్భంగా తొడతర మోడల్ ప్రైమరీ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించడం జరిగింది. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి2 మోహన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిరప పంటపై రైతులకు అవగాహన



మిరప పంటను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్, కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.రామకృష్ణా రావు ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని రైతు పొలంలో మిరప పంటపై క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. ఈ సందర్శనలో మిరప పంటలో తామర పురుగుల (రసం పీల్చే పురుగులు) ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ పురుగులు పంటకు గణనీయమైన నష్టం కలిగిస్తున్నాయని తెలిపారు. పురుగుల నివారణకు రైతులకు అవసరాన్ని బట్టి కింది రసాయన పురుగుమందులు వాడాలని సూచించారు. ఈ సమాచారాన్ని రైతుసేవాకేంద్రాల ద్వారా అందరికి చేరవేయాలని ఆయన కోరారు. సందేహాలు ఉన్న రైతులు 9866021756ను సంప్రదించవచ్చు అని మండల వ్యవసాయ అధికారి గీతా కుమారి తెలిపారు. వారి వెంట రైతుసేవ కేంద్రం వ్యవసాయ సహాయకుడు విఏఏ.మధు, రైతులు పాల్గొన్నారు.


ప్రజావ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధిచెపాల్పి

వైసిపి పూతలపట్టు సమన్వయకర్త సునీల్ కుమార్



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ప్రజావ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పూతలపట్టు నియోజకవర్గం వైయస్ఆర్సీపీ సమన్వయకర్త సునీల్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని సెట్టేరి, నల్లగాడు పంచాయతీలలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో పరిపాలన కొనసాగిస్తుందని అందుకు నిదర్శనమే ప్రభుత్వ వైద్య కళాశాలలను విధానమని అన్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తెలిపేందుకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. జడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా, మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి, మాజీ సింగల్ విండో చైర్మన్ దత్తు రెడ్డి పాల్గొన్నారు.

స్కూల్ నిర్మాణ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డీఈ కిషోర్

ప్రజాశక్తి - రొంపిచర్ల: రొంపిచర్లలోని ఏపీ మోడల్ స్కూల్ భవన నిర్మాణం పనులను ఆర్డబ్ల్యూఎస్ డీఈ కిషోర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నెలాఖరు లోపల భవన నిర్మాణం పూర్తి హంగులతో పూర్తి చేస్తామన్నారు. డిసెంబరు నెలాఖరు లోపల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా 10 రూములను పూర్తి చేసి ఇస్తామన్నారు. భవన నిర్మాణానికి నిధుల కొరత లేదని, జరిగిన పనుల మేరకు జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ కూడా త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. ఆయన వెంట ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్, కాంట్రాక్టర్ బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం లక్ష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు యువతీ, యువకుల నుంచి విశేష స్పందన లభించింది. మొత్తం 10 మెగా కంపెనీలు నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు 220 మంది ఆసక్తి ఉన్న అభ్యర్థులు హాజరయ్యారు. 123 మంది పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో 47 మంది మహిళా కళాశాల విద్యార్థినులే కావడం గమనార్హం. ఎన్నికైన అభ్యర్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి . రాజశేఖర్ ఆఫర్ లెటర్స్ ను అందజేశారు. జేకేసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.ఉషారాణి, లక్ష్ ఫౌండేషన్ ప్లేస్ మెంట్ మేనేజర్ భాను చంద్రారెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ పి.భారతి, వైస్ ప్రిన్సిపాల్ వి .కె దీనదయాల్, ఫిజికల్ డైరెక్టర్ ఏ. నరసింహారావు, సుమతి పాల్గొన్నారు.



రెండే శ్లాబులు.. అన్ని వర్గాలకు లాభాలు



చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిఎస్‌టి శ్లాబులను రెండుకు తగ్గించడం వల్ల అన్ని వర్గాలకూ ప్రయోజనం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. దీనివల్ల ఏటా సుమారు రూ.8వేల కోట్ల పన్ను ఆదా అవుతుందని చెప్పారు. సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ వాహన ర్యాలీని కలెక్టరేట్ వద్ద గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఆర్టీవో కార్యాలయం నుంచి చిత్తూరు పట్టణంలో గాంధీ బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మోటార్ సైకిల్ నుంచి కార్లు, వ్యాన్లు, ట్రాక్టర్ల వరకు అన్ని రకాల వాహనాలు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ జిఎస్‌టిని నాలుగు నుంచి రెండు శ్లాబులకే కుదించి, సుమారు 99 శాతం వస్తువులను 5 శాతం శ్లాబులోకి చేర్చడం వల్ల పన్నులు భారీగా తగ్గుతాయని చెప్పారు. దీనివల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలకు భారీ ఊరట లభిస్తుందని పేర్కొన్నారు. తగ్గిన జిఎస్‌టి లాభాలను ప్రజలకు తెలియజెప్పేందుకు జిల్లా అంతటా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈఅవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్వయంగా ట్రాక్టర్ నడిపారు.


జీఎస్టీ తగ్గింపు చారిత్రాత్మక నిర్ణయం -ఎమ్మెల్సీ శ్రీకాంత్

కుప్పం: కూటమి ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం చారిత్రాత్మక నిర్ణయమని, జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఎంతో లబ్ధి జరుగుతోందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం కుప్పం పట్టణంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీకాంత్ బుల్లెట్, ట్రాక్టర్ నడిపి జీఎస్టీ తగ్గింపు వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయని ప్రజలకు వివరించారు. కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మాజీ ఏఎంసి చైర్మన్ సత్యేంద్రశేఖర్, కౌన్సిలర్లు జిమ్ దాము, జాకీర్, సోమశేఖర్, సురేష్, విస్తీర్ణ కమిటీ సభ్యుడు మంజునాథ్, క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, కో క్లస్టర్ శ్యాం సుందర్, రెస్కో డైరెక్టర్ శివ శారదమ్మ, ఆర్‌టిఓ మధుసూదన్ పాల్గొన్నారు.

జిఎస్టి తగ్గింపు పై ఇంటింటి ప్రచారం

జీఎస్టీ తగ్గింపు పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కూటమి శ్రేణులు ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం జీఎస్టీ తగ్గింపు పై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు అందజేశారు. మాజీ ఎంసి చైర్మన్ సత్యేంద్ర శేఖర్, కౌన్సిలర్లు సోమశేఖర్, సురేష్, పార్టీ విస్తరణ కమిటీ సభ్యుడు మంజునాథ్, రెస్కో డైరెక్టర్ శివ, వన్యకుల క్షత్రియ డైరెక్టర్ వేణు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు చేయూత లభించిందని పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమనాయుడు అన్నారు. జీఎస్టీ స్పెషల్ ఆఫీసర్ సుమతి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు కుసుమ, మురళి ఆధ్వర్యంలో గంగాధర నెల్లూరులో గురువారం సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై పలువురు టిడిపి నేతలు, అధికారులు గంగాధరనెల్లూరు పురవీధుల్లో ఫ్లెక్సీ చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. జిల్లా టిడిపి యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరుల్‌నాథన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నియాజ్అలి, కోదండరెడ్డి పాల్గొన్నారు.



కుప్పంలో..

విజయపురం (నగరి) : కేంద్ర ప్రభుత్వం 12 శాతం నుంచి 5 శాతం జీఎస్‌టీ తగ్గించడం జరిగిందని, ఆ ప్రకారం ప్రతి ఒక్కరు ధరల నియంత్ర పాటించాలని నగరి ఆర్‌డీవో వాసుదేవరెడ్డి తెలిపారు. గురువారం ఆర్‌డీవో ఆధ్వర్యంలో జీఎస్‌టీపై అవగాహన ర్యాలీ జరిగింది. నగరి టవర్ క్లాక్ నుంచి ఓంశక్తి వరకు ఈ ర్యాలీ సాగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ జీఎస్‌టీ తగ్గించినా వ్యాపార వేతలు వాటిని పాటించడం లేదన్న వాదన వినిపిస్తున్నాయని, అలాంటి చర్యలకు ఎవ్వరైౖ పాల్పడి, ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- యాదమరి: పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి విధిగా వైద్యపరీక్షలు చేయించుకోవాలని యాదమరి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో సుమారు 400 మంది విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్ చేసి పిల్లలకు ఎత్తు, బరువు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ అప్ డేట్ చేయడం జరిగిందని అనిల్ కుమార్ తెలిపారు. విద్యార్థులు రక్తహీనతకు గురికాకుండా ఆకుకూరలు, పాలు, గుడ్లు తినాలని సూచించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, లక్ష్మీపతి, సెల్వరాణి, ఆప్తాలమిక్ అసిస్టెంట్ మధుసూదన్, ఎంఎల్‌పిహెచ్ విష్ణుప్రియ, దిల్షాద్, లోకేశ్వరి, సౌందర్య, సుస్మిత, దివ్యశ్రీ, భానుప్రియ, ఏఎన్ఎం, ఆశలు పాల్గొన్నారు.

ఆయుధ పూజలు చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పలమనేరు: వాహన, ఆయుధ పూజలను ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి గురువారం నిర్వహించారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో తన సతీమణి రేణుకా రెడ్డితో కలసి ఘనంగా పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలతో పాటు రక్షణా ఆయుధాలు, పనిముట్లకు పూజలు చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, డ్రైవర్లకు దసరా కానుకలను అందించారు.

ఇన్‌ఛార్జి తహశీల్దారుగా కిరణ్ కుమార్

ప్రజాశక్తి - రొంపిచర్ల: రొంపిచర్ల మండలం ఇంచార్జ్ తహశీల్దారుగా డిప్యూటీ తహశీల్దారుగా పనిచేస్తున్న కిరణ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహశీల్దారుగా పనిచేస్తున్న అమర్నాథ్ చిత్తూరు కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. రొంపిచర్ల మండలంలో ప్రజాసమస్యలు, రెవెన్యూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. బాధ్యతలు చేపట్టిన తహశీల్దారు కిరణ్ కుమార్‌కు రెవెన్యూ సిబ్బంది శు భాకాంక్షలు తెలిపారు.



శివయ్య సేవలో ఎంఎల్ఎ కన్నా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. వీరికి ఆలయాధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామీ, అమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు. ఏఈఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనం..పర్యవసానం...

ముంగిలిపట్టు దళితవాడలో విషాదం

ప్రజాశక్తి - చంద్రగిరి

ముక్కుపచ్చలారని బాల్యం మద్యానికి బానిసయ్యింది.. స్కూలుకు తీసుకెళ్లే బ్యాగులో పుస్తకాలతో పాటు, మద్యం బాటిల్ తోడయ్యింది.. బిడ్డ మద్యం తాగుతున్నాడని తెలిసినా బుద్ధిగా నాలుగు మాటలు చెప్పి మార్చుకునే ప్రయత్నం చేసే తీరిక కూలికెళ్లే ఆ తల్లిదండ్రులకు లేకుండా పోయింది.. పాఠశాలలో విద్యార్థి దురలవాట్లపై దృష్టిపెట్టి కౌన్సిలింగ్ ఇచ్చి భావిభారత పౌరునిగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులు ఆ దిశగా యోచన చేయలేదు.. పర్యవసానం టెన్త్‌క్లాస్ విద్యార్థి యశ్వంత్ ఆత్మహత్యకు దారితీసింది.. ప్రధానోపాధ్యాయునికి తెలిసిపోయిందని పారిపోయే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు రైలు కిందపడ్డాడా? కావాలనే ఆత్మహత్య చేసుకున్నాడో.. ఏమైతేనేం తల్లిదండ్రులకు దుఃఖాన్ని మిగిల్చింది ఈ ఘటన. ముంగిలిపట్టు దళితవాడలో విషాదాన్ని నింపింది.. కూలికెళ్లి ఇంటికొచ్చే తండ్రి తాగిరావడం, ఊరంతా బెల్టుషాపుల ప్రభావం, జాతర జరిగిందంటే ఏరులై మద్యం పారడం గ్రామాల్లో 'బాల్యం'పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయనడంలో ఏమాత్రం సందేహం లేదు. బడి, గుడి పక్కనే బెల్టుషాపులు రాజ్యమేలుతున్న ఈ రోజుల్లో ఇటువంటి ఘటనలు బాధాకరమనే చెప్పాలి.

చంద్రగిరి మండలం ముంగిలిపట్టు దళితవాడలో రమేష్, జ్యోతి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిది నిరుపేద కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు. ఇద్దరూ గ్రామ పరిధిలోని కొంగరవారిపల్లి హైస్కూల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. పెద్దకొడుకు యశ్వంత్ (15) పదో తరగతి చదువుతూ గ్రామంలోని పోకిరి వాళ్లతో చేరి దురలవాట్లకు బానిసయ్యాడు. తెలిసితెలియని వయస్సు, ఆపై మద్యం అలవాటు.. ఇది చూసిన తోటి విద్యార్థులు తరగతి గదిలోనే మద్యం తాగడం చూసి ఉపాధ్యాయులకు తెలిపారు. హెడ్‌మాస్టర్ భాస్కర్‌నాయుడు విద్యార్థిని మందలించి, విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో యశ్వంత్ భయభ్రాంతులకు గురై పాఠశాల ప్రహరీ గోడ దూకి రైల్వే ట్రాక్‌పైకి పరిగెత్తాడు. అదే సమయంలో రైలు వస్తుండడంతో రైలు ఢీకొని మృతిచెందాడు. దీంతో ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పాకాల రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. విద్యార్థి మృతితో ముంగిలిపట్టు దళితవాడ శోకసంద్రమయ్యింది.



పాఠశాల ప్రహరీగోడ దూకి రైల్వేట్రాక్‌పై విద్యార్థి ఆత్మహత్య (నిన్నటిది)

నేటి యువతే దేశ అఖండ సంపద

యువతరంగ్'లో వీసీ నరసింగరావు

ప్రజాశక్తి - క్యాంపస్: నేటి యువతే దేశానికి నిజమైన అఖండ సంపదని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య తాతా నరసింగరావు అన్నారు. ఎస్వీయూలోని స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే యువతరంగ్ - 2025 కార్యక్రమం గురువారం శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించారు. ప్రారంభోత్సవంలో వీసీ ఆచార్య నరసింగరావు మాట్లాడుతూ మానవ జీవితానికి కళలు, సాహిత్యం వంటివి అవసరమని, అవి మనిషిని ఆదర్శంగా మారుస్తాయని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు కళలు ప్రతీకగా నిలుస్తాయని చెప్పారు. తనకు వ్యక్తిగతంగా కళలు, సంగీతం పట్ల ఆసక్తి ఉన్నా, సాధన చేయడం సాధ్యం కాలేదని తెలిపారు. అయితే, వీలైన మేరకు సంగీతాన్ని నేర్చుకున్నానని చెప్పారు. క్రీడా , సాంస్కృతిక రంగాల్లో యూనివర్సిటీ మంచి గుర్తింపును సంతరించుకోవడం శుభపరిణామం అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా సాంస్కృతిక అభివృద్ధికి అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. తాను యూనివర్సిటీలో చదువుకునే సమయంలో యూత్ ఫెస్టివల్ ఎంతో ఆనందాన్ని ఇచ్చేదన్నారు. అంతకు రెట్టించిన ఉత్సాహంతో యువతరంగ్ -2025 గొప్పగా నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. యూనివర్సిటీ విద్యార్థులను అద్భుతమైన క్రీడాకారులుగా, కళాకారులుగా తీర్చిదిద్దడం అవసరం అన్నారు. చదువుతోపాటు మన సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేయడానికి కళలే ఆధారమని అన్నారు. యూనివర్సిటీ పరిధిలో కళలకు సంబంధించిన ప్రత్యేక కోర్సులు ఏర్పాటు చేయాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ యువతరంగ్- 2025 ఎంతో ఉత్సాహంగా ప్రారంభమైందని తెలిపారు. ప్రముఖ సినీ నటుడు కిరణ్ అబ్బవరం సందడి చేశారు. యువతరంగ్- 2025 ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తాను ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఉత్తేజం పొందానని తెలిపారు. తనకు వచ్చిన గుర్తింపుకు యువత ముఖ్యకారణం అన్నారు. భవిష్యత్తులోనూ తనను ఇదేవిధంగా ఆదరిస్తారని నమ్మకం ఉందన్నారు. తొలినాళ్ళలో తనకు లక్ష్యం ఏమిటో అర్థం కాలేదని తెలిపారు. పాతికేళ్ళ వయసులో జీవిత లక్ష్యం అర్థమైందనీ, కళాకారుడిగా రాణిస్తానని నమ్మకం పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డెవలప్ మెంట్ కౌన్సిల్ డీన్ చెంద్రాయుడు, ఆర్ట్స్, కామర్స్, ఇంజనీరింగ్ ప్రిన్సిపాళ్ళు సుధారాణి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ బివి మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో- ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, కళ్యాణ్ పాల్గొన్నారు. ఉదయం 9.30 గంటలకు యువతరంగ్- 2025 ప్రారంభ సూచికగా యూనివర్సిటీలో భారీర్యాలీ నిర్వహించారు. అన్నమయ్య భవన్ నుంచి శ్రీనివాసా ఆడిటోరియం వరకూ కళాబందాలు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి.

రుయాలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రుయా ఆస్పత్రిలో తొలగించిన 50 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న విషయం విదితమే. గురువారం డిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం మాట్లాడుతూ పద్మావతి కంపెనీ కాంట్రాక్టర్ భాస్కర్‌నాయుడు టెండర్ తీసుకుని ఎనిమిది రోజులు పని చేయించుకుని, తొమ్మిదో రోజు నుంచి మీకు యాభై ఏళ్లు దాటాయి కాబట్టి పనికి రావద్దంటూ హఠాత్తుగా తొలగించడం సరైంది కాదన్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించడాన్ని నిరసిస్తూ డిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఎసిఎల్‌కు వినతిపత్రం ఇచ్చారు.కాంట్రాక్టర్ ఏది అనుకుంటే అది చట్టం కాదని, కాంట్రాక్టర్ రాసుకున్న ఎంఒయు కార్మిక చట్టం కాదని, కార్మిక చట్టం ప్రకారం కాంట్రాక్టు కార్మికులు 60 సంవత్సరాల వరకు పని చేయవచ్చని తెలిపారు. తొలగించిన కార్మికులను యధావిధిగా విధుల్లోకి తీసుకునొ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు కె.వేణుగోపాల్, సిఐటియు నగర అధ్యక్షురాలు పి.బుజ్జి, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు జి.చినబాబు పాల్గొన్నారు. ఎసిఎల్ స్పందిస్తూ ఖచ్చితంగా కార్మికులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. తొలగించిన కార్మికులు లక్ష్మమ్మ, బి.రాణి, వై.లక్ష్మమ్మ, ఎస్‌బిబి, పి.సుబ్రమణ్యం, పి.రామ్మూర్తి, కె.సుబ్రమణ్యం, పి.లక్ష్మీదేవి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

తిరుపతిలో చోరీ.. కుప్పంలో రికవరీ

తెలుగు రాష్ట్రాల్లో అంతరష్ట్ర దొంగల చోరీలు

ప్రజాశక్తి-కుప్పం: తిరుపతిలో జరిగిన ఓ భారీ చోరీకి సంబంధించి కుప్పం ప్రాంతానికి చెందిన ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను తిరుపతి జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కుప్పం మున్సిపాలిటీ మోడల్ కాలనీకి చెందిన వినోద్ భార్య నందిని, రాజు కాలనీకి చెందిన పార్థిభ భార్య జ్యోతి, శాంతి లేఔట్‌లో నివాసం ఉంటున్న అరుణ్ భార్యలను తిరుపతి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. దాదాపు 410 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలించి కుప్పంలో విక్రయించారన్న సమాచారంతో తిరుపతి పోలీసులు నాలుగు రోజులుగా కుప్పంలో రికవరీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే కొంతమంది మధ్యవర్తులు జోక్యం చేసుకొని పోలీస్‌స్టేషన్ బయట సెటిల్మెంట్ చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కుప్పం పట్టణంలోని పలు జువెలరీ షాపుల్లో దొంగ బంగారాన్ని విక్రయించారని సమాచారంతో తిరుపతి పోలీసులు రికవరీ కోసం కుప్పం వచ్చినట్లు తెలుస్తోంది. అయితే గుట్టుచప్పుడు కాకుండా ఈవ్యవహారాన్ని సద్దుమణిగించేందుకు పలువురు అంతర్రాష్ట్ర దొంగల ముఠా మధ్యవర్తులు సుమారు రూ.30 లక్షలకు భేరసారాలు ఆడుతున్నట్లు పట్టణంలో చర్చనీయంగా మారింది. ఒకప్పుడు తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ కుప్పంలో స్థిర నివాసాలు ఏర్పరచుకున్న అంతరాష్ట్ర దొంగల ముఠా ఇటీవల కాలంలో ఏపీలో సైతం వరస చోరీలకు పాల్పడుతూ తమ దొంగతనాల అడ్డాను తెలుగు రాష్ట్రాలకు మార్చినట్లు తెలుస్తోంది.

ద్రావిడ రాష్ట్రాల్లో వందలాది కేసులు

కుప్పం ప్రాంతంలో స్థిర నివాసాలు ఏర్పరచుకున్న అంతర్రాష్ట్ర దొంగల పై తమిళనాడు, కర్ణాటక, పాండిచ్చేరి, కేరళ రాష్ట్రాల్లో వందలాది కేసులు ఉన్నాయి రెప్పపాటులో చోరీ చేయడంలో ఈ దొంగల ముఠాకు చెందిన మహిళలు సిద్ధహస్తులు. కుప్పం ప్రాంతంలో విలాసవంతమైన జీవితాలను గడుపుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాపై కుప్పం ప్రాంతంలో దొంగతనాలకు సంబంధించిన కేసులు లేకపోయినా ఇతర నేరాలకు సంబంధించిన కేసులు కోకొల్లలుగా ఉన్నాయి. అయితే, ద్రావిడ రాష్ట్రాల్లో ఈ అంతర్రాష్ట్ర దొంగల ముఠాపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచడంతో ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో సైతం దొంగతనాలకు పాల్పడుతున్నారు.

మెకానిక్ షాప్‌లో చోరీ

ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు రూరల్ కొలమాసనపల్లిలో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. పలమనేరు - కుప్పం జాతీయ రహదారి పక్కనే ఉన్న విజయ్ కార్ గ్యారేజ్‌లో బుధవారం అర్ధరాత్రి దొంగలు చొరబడ్డారు. గ్యారేజ్లో ఉన్న విలువైన కార్ ఇంజన్లు, 4 కేసుల ఇంజన్ ఆయిల్, స్పేర్ పార్టులు ఎత్తుకెళ్లిపోయినట్లు షాపు యజమాని విజయ్ తెలిపారు. దొంగిలించిన వస్తువుల విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని షాపు యజమాని చెప్పున్నారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో చోరీపై ఫిర్యాదు చేశారు. దొంగతనాలు అరికట్టడానికి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మినీ లారీ, ఇనోవా ఢీ



ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని పాతర్కాడు సమీపంలో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదంలో జరిగింది. తిరుత్తణి నుంచి ఇనోవాలో పాతర్కాడు బయలుదేరి వస్తుండగా ఎదురుగా వస్తున్న టమోటా మీని లారీ ఎస్ఎన్ కండ్రిక నుంచి కనకమ్మ సత్రం వైపు వెళుతుండగా బస్సును ఓవర్ ట్రాక్ చేస్తూ ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈప్రమాదంలో కారు నడుపుతున్న ప్రత్యూష్‌కి తీవ్రంగా గాయపడ్డారని అతని వైద్యం నిమిత్తం నియట్ ఇంటర్నేషనల్ హాస్పిటల్‌కి తరలించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: యూరియా కోసం ఏర్పేడు మండలం నుంచి ఎస్ఆర్ పురం మండలంకు వచ్చిన గుర్రం శ్రీరాములు (60) బుధవారం మధ్యాహ్నం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మడుగు పాల్యం గ్రామానికి చెందిన గుర్రం శ్రీరాములు, దుర్వాసన నాయుడు, మురళి, సుబ్రహ్మణ్యం ఆటో తీసుకొని బుధవారం ఎస్ఆర్ పురం మండలంలోని పద్మాపురం సచివాలయంలో ఎరువుల కోసం సచివాలయం చేరుకున్నారు. శ్రీరాములతో వచ్చిన మిగతా ముగ్గురు భోజనం చేయడంతో శ్రీరాములు భోజనం పొట్లం కట్టుకుని సచివాలయం పక్కన ఉన్న సిమెంట్ రోడ్‌పై భోజనం చేసి సిమెంట్ రోడ్డు పక్కనే ఉన్న నీటి ట్యాప్ వద్ద చేయి కడుక్కునే క్రమంలో అదుపుతప్పి పక్కన్ను విద్యుత్ స్తంభానికి అమర్చి ఉన్న మీటర్‌పై చేయిపడంతో విద్యుత్ షాక్కు గురై పక్కనే ఉన్న సిమెంట్ రోడ్డుపై పడిపోయాడు. వెంటనే ఎరువు తీసుకెళ్లడానికి తీసుకొచ్చిన ఆటోలో గాయపడిన శ్రీరాముని వేసుకొని చికిత్స కోసం మండల కేంద్రానికి తీసుకు వస్తుండగా ఎదురుగా వచ్చిన 108 సిబ్బంది పరీక్షించి శ్రీరాములు చనిపోయాడని ధ్రువీకరించడంతో సొంత గ్రామానికి తీసుకెళ్లారు. గురువారం మృతిని సమీప బంధువులు ఎస్ఆర్ పురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో, మృతుని ఇంటి వద్ద కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించారు.

